# అబీగయీలు

# సుబుద్ధిగల స్త్రీ

## (25:14-42)

"గంటకు కట్టే తాడు కంటె స్త్రీ వెంట్రుక అధికమైన దానిని లాగుతుంది" అనే పాత జర్మనీ సామెత సమాజంలో స్త్రీ స్పందనను గూర్చి తెలుపుతుంది. ముద్దుగుమ్మ అబీగయీలు ఈ సామెతకు తగిన ఉదాహరణ. ఆమె తల్లిదండ్రులను గూర్చి గాని వంశావళిని గూర్చిగాని లేఖనాలలోనుండి మనకు ఏమీయు తెలియదు. దైవభక్తి గల వాతావరణంలో ఆమె పెరిగినట్టుంది. దేవుడైన యెహోవాను ఎరిగినదై, మనోహరమైన భక్తిని ఆమె కలిగియుంది.

మొదటి సమూయేలు గ్రంథంనుండి ఈ క్రింది వాస్తవాలను ఆమెను గూర్చి తెలిసికొంటాం: ఆమె పేరుకు "ఆనందానికి హేతువు" అని అర్థం. తన సహజ స్వభావాన్ని అది వ్యక్తపరచునదిగాను, యితరులపై అలాటి స్పందనను కనుపరచునదిగాను ఉంది. ఒక భయంకరుడైన వ్యక్తిని ఆమె వివాహం చేసుకుంది. ఈ వివాహం తాను ఎన్నుకొని చేసికొన్నది కాదు. తూర్పు దేశాలలో సహజంగా తల్లిదండ్రులు బిడ్డలకు వివాహం ఏర్పాటు చేస్తారు. అయితే ఆమె "వివేకముగలదియు సౌందర్యవతియునైయుంది" (25:3). అనేక మంది స్త్రీలు నేడు అలాటి కలయికను ఆక్షేపిస్తారు. అంతే కాదు వివేకాని తోసిపుచ్చి బాహ్య సౌందర్యానికి ప్రాధాన్యతనిస్తారు! బైబిలులో యింకా ముగ్గురు స్త్రీలు (శారా, వష్తి, మరియు బత్షెబ) మాత్రమే "సౌందర్యవంతులని" పిలువబడ్డారు. అబీగయీలునందు బాహ్య సౌందర్యం, మంచితనంతోను అంతరంగపు అలంకరణతోను మెరుగుపరచబడింది (కీర్తన. 45:13తో పోల్చి చూడు). ఆమె దావీదు ఎనిమిది మంది భార్యలలో ఒకతెగా మారింది. తక్కినవారు మీకాలు (1 సమూ. 18:27), బత్షెబ (2 సమూ. 12:24), అహీనోయము, మయకా, హగ్గీతు, అబీటలు, ఎగ్లా (2 సమూ. 3:2-5) అనువారు. ఈ ఎనిమిది మందిలోను, దావీదు జీవితంలో కలిగిన గొప్ప మంచికి అబీగయీలు మూలమైయుండవచ్చు.

మొదటి సమూయేలు 25:3, 14-42లో ఒక అద్భుతమైన స్త్రీతో మనకు పరిచయం కలిగింది. అబీగయీలు కథ దావీదుపైనను, నేడు ఆమె గాథను చదివేవారిమీదను చెరుగని ముద్రను వేస్తుంది. ఈ స్త్రీని గూర్చి వివరించిన మీదట, దావీదుకు ఆమెపై ఉన్న అభినందన, ఆప్యాయతను సులభంగా గ్రహించగలం.

### ఆమె కథ

అబీగయీలు కథ విషాదాంతపు ఉద్వేగాలతో నిండిన సంఘటనలో కన్పిస్తుంది.

కృతజ్ఞత లేమి, అహంభావము, మొండితనం, ద్వేషము, దుఃఖము, కోపము మరియు అవివేకపు మాటలతో అది కూడింది. ఈ అంధకారపు అమరికలో, అబీగయీలు ప్రసన్నత ప్రకాశమానమైన దివ్యముద్రగా మిగిలి పోయింది.

దావీదు సైనికులు నాబాలు మందలను నడిపించి కాపాడారు. ఇది ఉదారమైన సేవ, ఏ జీతం లేని దావీదు యొక్క దయకు నాబాలు కఠినమైన బుద్ధిహీనమైన మాటలతో జవాబిచ్చాడు (25:3). దావీదుకు జరిగిన అవమానానికి, నాబాలు యింటివారి రక్తంతో ప్రతిఫలమివ్వబడింది (25:22). ఈ పరిస్థితి రక్తపాతంతో కూడిన కఠినమైన యుద్ధానికి దారితీసింది.

ఉద్వేగాలన్నీ శిఖరాగ్రాన్ని చేరుకున్నప్పుడు, అబీగయీలు ప్రవేశించి, దావీదు కోపాన్ని సమాధానపరచింది (25:18నుండి). ఉదారమైన బహుమానాన్ని యిచ్చి, వినయముతో కూడిన క్షమాపణను దావీదును అడిగింది. పగ తీర్చుకోవాలనే అతని కోర్కెను మానుకోవలసిందిగా ఆమె దావీదును వేడుకొంది. ఆమె దావీదును శాంతిపరచిన పిమ్మట, ఆమె తన యింటికి, నాబాలు వద్దకు తిరిగి వెళ్లింది. ఆమె నమ్మదగిన భార్యయు, పనికిమాలిన తన యింటి యజమానుని కాపాడే భాగస్వామియునైయుంది. విశ్వాసాన్ని వాగ్దానం చేసినదానిగా ఆమె తన పెనిమిటితో కొనసాగింది.

నాబాలు మరణానంతరం, దావీదు తన ప్రతిపాదనను అబీగయీలు ఎదుటపెట్టాడు (25:39). అబీగయీలు దావీదుకు భార్యగా, దావీదు కుమారునికి తల్లిగాను తన జీవిత కార్యాన్ని (2 సమూ. 3:3; 1 దినవృ. 3:1). తన జీవిత కాలమంత దావీదు భార్యగా ఆమె అతనితో కూడ ఉండిపోయింది. దావీదు అబీగయీలు చెప్పిన వివేకవంతమైన సలహాను, చల్లని ఆలోచనను స్వీకరించాడు. ఆమె తగిన భాగస్వామిగా ఋజువు చేసుకుంది (25:33ఎ).

## ఆమె గుణగణాలు

అబీగయీలు జీవిత గుణగణాలను, ఆమె శీలమును గూర్చియు తెలుసుకోడం నేటి స్త్రీలకు మాదిరిగా ఉండవచ్చు.

**ఆమె గౌరవించబడింది (25:17).** దావీదును నాబాలు తిరస్కరించిన సమస్యను ఆమె ఎలా పరిష్కరించగలదో సేవకులకు తెలుసు. సేవకులు ఆమె యోచనను తీర్మానాన్ని గౌరవించారు (25:35).

**కోపాన్ని ఆమె చల్లార్చగలదు (25:33, 35).** నాబాలు యొక్క మొరటుతనానికి క్షమాపణ చెప్పుకొనడం యిదే ఆమెకు మొదటి సారి కాకపోవచ్చు. సమాధానపరచే పాత్రను ఆమె తరచుగా వహిస్తుందంటే సందేహపడనక్కరలేదు. దావీదు ఆగ్రహాన్ని చల్లార్చడంలో జ్ఞానాన్ని, చాతుర్యాన్ని ఆమె ఉపయోగించగలిగింది.

**దేవునియందు ఆమెకు గొప్ప విశ్వాసముంది (25:26నుండి).** దేవునితో పరిచయం గలిగిన స్త్రీగా ఆమె ఈ వర్ణనలో కనబడింది. ఈ దౌర్భాగ్యమైన వివాహంలో ఆమె బంధించబడియున్నా, దేవునియందు ఆమెకున్న స్థిరమైన నమ్మిక పరిశుద్ధురాలుగా నిలిచియుండ ఆమెకు సామర్థ్యం కలిగించింది. ఆమె దావీదుతో మాట్లాడుతూ ఉండగా,

ఆమె విశ్వాసము సజీవమును అభ్యాసము కలిగినదియునైయున్నట్టు బయలుపరచబడింది. తన ప్రార్థనకు జవాబుగా ఆ కానుక దేవునినుండి కలిగిందే గాని తననుండి వచ్చింది కాదని 25:26, 27లో పలికిన మాటలయందు వ్యక్తపరచబడింది. ఆహారము నొసంగడంలో దేవుని కరుణాహస్తాన్ని ఆమె చూచింది.

**ఆమె దృఢమైనది తీర్మానంతో కూడినది (25:18నుండి).** పరిస్థితి వెంటనే గమనించింది, మరియు స్థిరమైన తీర్మానంతో ముందుకు సాగింది. ఏమి చేయాలో ఆమెకు తెలుసు, ఆమె చేయగల అతి శ్రేష్ఠమైన దానిని చేసింది. ఆమె దావీదును సమీపించినప్పుడు, ఆనాటి ఆచారాన్ని అనుసరించింది, అయితే క్రమబద్ధంగా ఆ కార్యం జరిగేలా జాగ్రత్తపడింది (25:24). పగ తీర్చుకోవాలన్న దావీదు యొక్క తృష్ణ తప్పని చెప్పడంలో ఆమె వెనుకాడలేదు. తరువాత ఆమె నాబాలుతో మాట్లాడినప్పుడు, తెలివి తక్కువతోకూడిన దోషాన్ని ఎదిరించింది (25:37).

**తన భర్త యొక్క క్షేమాన్ని ఆమె లక్ష్యపెట్టింది (25:31).** అబీగయీలు, తన యింటి క్షేమాన్ని అతి ప్రధానంగా భావించింది. ఆ క్షేమాన్ని ఖాయపరచుకొనడానికి అవసరమైనదేదైనా చేయడానికి ఆమె సిద్ధపడింది.

**ఆమె సాత్వికమును, దీనమనస్సు కలిగినదియునైయుంది (25:41, 44).** దావీదును ఆమె సందర్శించినప్పుడు, ఆమె దృఢత్వం చూపినా వినయంగానే ఉంది. కోపముతో ఉన్న దావీదుతో ఆమె చేసిన సంభాషణ అంత ఆమె వినయ భావాన్ని ప్రదర్శిస్తుంది. ఈ దృశ్యంలో 1 పేతురు 3:2-4 యొక్క రమ్యమైన ఉదాహరణ యివ్వబడింది.

> జడలు అల్లుకొనుటయు, బంగారునగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయునను వెలుపటి అలంకారము మీకు అలంకారముగ ఉండక, సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను; అది దేవుని దృష్టికి మిగుల విలువగలది.

**తాను సందర్శించిన ప్రతి ఒక్కరికి ఆమె దీవెనగా ఉంది (25:32).** దావీదుతో ఆమె తొలిగా కలిసికున్నప్పటినుండి అతని జీవితం సరిక్రొత్త భావాన్ని ఉద్దేశాన్ని గ్రహించింది. అబీగయీలును కలిసికొనే, ఎరిగే అదృష్టాన్ని ఎవరు నోచుకున్నా వారు దావీదు యొక్క అభిప్రాయాన్ని సరిగా అర్థం చేసికోగలరు.

**ఆమె మర్యాదగలదియు ఆతిథ్యమిచ్చునదైయుంది (25:4).** గొర్రె బొచ్చు కత్తిరించు ఉత్సవాలు విందులతోను, సంతోషముతోను కూడి ఉంటాయి. ఆలాటి ఉత్సవాల కొరకు చేసే సిద్ధపాట్లు కష్టతరమైనవైయుంటాయి. అయితే అబీగయీలు ఆ ఆయాసకరమైన పనులను స్వీకరించి మంచిగా చేసింది.

సౌందర్యంతో, సుబుద్ధిని కలిగిన అమోఘమైన ఈ గుణాలు ఆమెను మయోనుకు చెందిన మనుషులనుంచి ప్రత్యేకించాయి. నిజానికి ఆమె "కేవలం మహిమగలది" (కీర్తన. 45:13).

## పోటీపడడానికి ఆమె పిలుపులు

తన మాదిరిలో, అబీగయీలు మూడు స్థిరమైన సవాలులను విసిరి నవయుగ క్రైస్తవ స్త్రీలను తనతో పోటీపడమన్నట్టుగా ఆహ్వానిస్తుంది.

మొదటిది, ఏ స్త్రీ యొక్క స్వభావము ప్రసన్నత యితరులకు దీవెనగా ఉంటుందో అలా రూపొందుమని ఆమె స్త్రీలకు సవాలు విసరుతుంది. అబీగయీలు అంటే "ఆనందానికి హేతువు" అని అర్థం. ఇతరులపై ఆమె కనుపరచిన ప్రభావానికి అది తగిన వ్యాఖ్యానమైయుంది. సంతోషముగల, ఆనందమును తెచ్చు, మనోహరమైన మనస్సును ఆకర్షించెడు వ్యక్తిత్వమని సూచిస్తుంది. ఒక గదిలోనికి ఆమె నడిచి వచ్చినప్పుడు, సమస్తము స్పష్టంగా ఉండునట్టు మారిపోతాయి! ఆమె ఎక్కడికి నడిచినా సూర్యుడు ప్రకాశించాడు, పక్షులు పాడాయి, చిరునగవులు వెలిశాయి! ఆమె ఉనికి దీవెనకరంగా ఉండేది ఎందుకంటే, ఆనందం ఆమె యొక్క ఎడబాయని సహవాసిగా ఉంది (25:32).

కోపంతో ఉన్నవారిని చల్లార్చగల సామర్థ్యంతో ఆమె ఆశీర్వదించబడింది. సాధువైనట్టి, మృదువైనట్టియునైన మాటలతో ఆమె దావీదును చల్లార్చింది. "కలత చెందిన నీళ్లపై చమురు పోయగలదు" (25:33; జెకర్యా 8:19; 1 పేతురు 3:11). "కీడు కల్పించువారి హృదయములో మోసముకలదు సమాధానపరచుటకై ఆలోచన చెప్పువారు సంతోషభరితులగుదురు" అని సామెతలు అంటున్నాయి (సామె. 12:20). "సమయోచితముగా పలుకబడిన మాట విచిత్రమైన వెండి పళ్లెములలో నుంచబడిన బంగారు పండ్లవంటిది" (సామె. 25:11).

జీవితానికి శ్రేష్ఠమైన భావాన్ని ఉద్దేశాన్ని కనుగొనేలా యితరులకు సహాయపడేలా ఆమె దీవించబడింది. తాను దేవుని అభిషిక్తుడన్న వాస్తవాన్ని దావీదు జ్ఞాపకం చేసికొనేలా ఆమె అతనికి సహాయపడింది. "నీ దాసురాలనైన నా తప్పు క్షమించుము. నా యేలినవాడవగు నీవు యెహోవా యుద్ధములను చేయుచున్నావు గనుక ... నీకు ఆయన శాశ్వతమైన సంతతి నిచ్చును. నీవు బ్రదుకు దినములన్నిటను నీకు అపాయము కలుగకుండును" అని ఆమె అన్నది (25:28). దేవుని కృపకును కాపుదలకును అతడు పాత్రుడన్న విషయాన్ని కూడా ఆమె అతనికి గుర్తు చేసింది (25:30). దావీదు యొక్క కడపటి దినాల్లో ఓర్పును సహనాన్ని అతనికి నేర్ప సహాయపడియుండవచ్చు. కేవలం దావీదుకు మాత్రమేగాక ఆమె అనేకులకు సహాయపడియుండవచ్చు. తాను ఎక్కడ ఉన్నా గొప్ప కార్యాలను సాధించేలా (సేవలు జరిగించేలా) యితరులకు సహాయపడను ఆమె యిష్టపడింది!

రెండవది, తమ జీవితాలకు విశ్వాసం నడికట్టుగా చేసికొనేలా ఆమె స్త్రీలకు సవాలును విసరుతుంది! అబీగయీలు సౌందర్యానికి హేతువైయున్న ఒక విషయం – విశ్వాసం! దేవునియందలి తన విశ్వాసంనుండి సాత్వికత్వం, దాతృత్వం, అక్కర, దయ, మొదలైనవన్నీ ఉద్భవించాయి (25:26-31).

నేడు స్త్రీలు అబీగయీలు యొక్క విశ్వాసంతో పోటీపడినట్టయితే, వారు చెప్ప శక్యం కానంత దీవెనకు మూలమైయుంటారు. స్త్రీలారా, అబీగయీలుకు ఉన్నట్టు మీ

విశ్వాసము మీకు నడికట్టుగా ఉంచుకొనండి!

మూడవది, జీవితంలో ప్రతికూలమైన విసుగు పుట్టించే పరిస్థితులను జయించడానికి గాను దేవునియందలి ఆనందం కలిగియుండాలని కూడా ఆమె స్త్రీలకు సవాలు విసరుతుంది!

అబీగయీలు యొక్క వివాహము సంసార జీవితం హీనమైన దానికంటె హీనమైనది! "మర్యాదలేని మృగతుల్యమైన భర్త" వద్దనుండి కేవలం అంధకారం తప్ప, శాంతి, సంతోషాలు యిచ్చినైకాదు. త్రాగుబోతు, దేవుడులేని, జడ స్వభావం గలవాడు భర్తగా ఉంటే సహించింది. తన దుష్ట మార్గాలను ఆమె వివరించుతూ, యితరులపై అతడు అహంభావంతో మండిపడినప్పుడు వారికి క్షమాపణ చెప్పుకునేది. అయినా ఆమె పరిశుద్ధురాలిగానే నిలిచింది!

క్రైస్తవ స్త్రీలలో కొందరు యిదే పరిస్థితిని ఎదుర్కొంటారు. నాబాలువంటి భర్తకు, యింటికి వారు గురియై ఉంటారు. వారు ధైర్యవంతులై, సణుగుడు లేనివారై కూడా ఉంటారు. భర్త ఎంతటి క్రూరుడైనా, మొరటువాడైనా వారు దేవునికి నమ్మకంగా ఉంటారు. ఈ పోటీ అంత తేలికైనది కాదు. స్త్రీలారా, ఇంటి వద్ద "నాబాలు" వంటివానితో సతమతమౌతూ వానిని వదలుకోవాలని వీరు శోధింపబడినట్టయితే. వదలుకోవద్దు! దైవభక్తిగల అబీగయీలును జ్ఞాపకముంచుకొనండి

## ముగింపు

అబీగయీలు సౌందర్యవతి, కేవలం భౌతికంగా మాత్రమే కాదు, అంతకంటె ఎక్కువగా ఆమె తన శీలంలోను, విశ్వాసంలోను సౌందర్యంగలదై ఉంది. గొప్ప సవాలులను నిలబెట్టుకొనడానికి ఆమె సరితూగినదైయుంది. కోపోద్రేకంతో మండియున్న హృదయాన్ని ఆమె నిమ్మళింపజేయగలదు, కోపిష్టియైన త్రాగుబోతును గద్దించగలదు. ఆమె నిజంగా బలమైన స్త్రీయే! ఆమె బలం ఒక మూలంనుండి వచ్చింది – దేవునియందలి ఆమె విశ్వాసంవలన కలిగింది.

స్త్రీలారా, ఈ ఆలోచనలు జాగ్రత్తగా మీ జీవితాలకు వర్తింపజేసికొనండి. శాంతి, ఉద్దేశము, యితరులకు విశ్వాసము కలుగునట్లు మీ పలుకుబడిని నిశ్చయం చేసికొనండి. పిలువబడని నీ పేరుగా "అబీగయీలును" సార్థకం చేసికో, మరియు లోకంలో "ఆనందానికి హేతువు" కమ్ము.